# పట్టు చీర

"ఏమండీ ? మీకోసం ఎవరో, కార్లో వచ్చారండి"

కుర్చీలో కూర్చుని బియ్యంలో రాళ్లేరుతున్న జానకిరామయ్య, చేటపక్కన పెట్టి, ఎవరా అని గుమ్మంలోకి వెళ్లాడు.

క్రిందఇంటివారబ్బాయి వెళ్లాడు. నడివయస్సు స్త్రీ నవ్వుతూ నిలబడివుంది మెట్లమీద :

జానకిరామయ్య ఆమెనే చూస్తూ నిలబడ్డాడు ఆ వచ్చిందెవరో, గుర్తురాక!

ఆ వచ్చినావిడ, గాగుల్స్ తీసి, "ఏమిటీ? ఇలా మెట్లమీదే నిలబెట్టి చూస్తున్నారు. నే నెవరో గుర్తుకు రాలేదా?" అనంది.

"రండి!" జానకిరామయ్య లోపలకు దారితీశాడు. ఆమె అనుసరించింది.

కుర్చీ ముందుకు నెట్టి, "కూర్చోండి" అన్నాడు, తను నిలబడి!

ఆమె కూర్చోబోతూ "ఇంతకూ నే నెవర్నో గుర్తుపట్టారా?" అనంది.

జానకిరామయ్య తలొంచుకున్నాడు.

"సుజాతను!" ఆమె చెప్పింది.

అప్పుడు తలెత్తి, ఆమెను చూశాడు నింపాదిగా! చూసి, "చాలా ఏళ్లయింది చూసి! అందుకే గుర్తుకు రాలేదు!" అన్నాడు, సంజాయిషీ చెబుతున్నట్లు.

సుజాత కూర్చున్న చోటునుంచే ఇల్లంతా పరిశీలించసాగింది.

ముని ఆశ్రమంలా ఇల్లు, పొందికగా తీర్చిదిద్ది వుంది. ఓ ప్రక్కన స్టీలుబీరువా చిన్నది. దానిపై రేడియో. ఆ రేడియోపై రెండు లంబాడీ బొమ్మలు. ఆ ప్రక్కనే పుస్తకాల అలమరా. ప్రక్కన గుడ్డలస్టాండు. గదిలో

ఇంకో ప్రక్కనవారు మంచం. దాని తలాపిన ఫోటోలు. గచ్చుమీద లతలు-సున్నంతో వేసిన ముగ్గు. గది మధ్యన వేలాడదీసిన పిచ్చికగూడు.

అన్నీ చూశాక జానకిరామయ్యను పరిశీలనగా చూసింది సుజాత.

భార్యలేచిపోయినవాడిలా పడకకుర్చీలో దిగులుగాపడుకున్నాడు. జుత్తంతా నెరసి, తాటికాయలావుంది. చప్పిదవడలు, అగాధంలోంచి మిణుకు మిణుకుమనే మిణుగురు పురుగుల్లా కళ్ళు. ముక్కుమీద కళ్లజోడు గీచిన నల్లని ముద్ర. గుండెలమీద నెరసిన వెంట్రుకలు, దాన్ని కప్పుతూ పల్చాటి ఖద్దరు బనీను. దాని జేబులో బీడీలకట్ట, మాసిన లుంగీ!

ఆ రూపం చూసిన సుజాతకు జాలి వేసింది. కళ్లు చమర్చాయి.

"మీరు చాలా మారిపొయ్యారు" అంది గోడకున్న ఫోటోలో, యువకుడుగా వున్న జానకిరామయ్యను చూస్తూ.

జానకిరామయ్య మరీ ముడుచుకుపొయ్యాడు, డొక్కలో దెబ్బతగిలిన వాడిలా!

అవతల గదిలో, వాకిలికి ఎదురుగావున్న స్టౌమీదవున్న గిన్నెలో నీళ్ళు మరిగి, మూతను ఎత్తెత్తివేస్తున్నది.

"ఎసరు కాగింది" అంది సుజాత

జానకిరామయ్య మాట్లాడలేదు. విన్నాడో లేదో కూడా తెలియకుండా వున్నాడు.

సుజాత, ఆర్ద్రమైన కళ్లు వత్తుకుంది రుమాలుతో. పమిటికొంగు బొడ్లో దోపుకుని, కుచ్చెళ్ళు సవరించుకుని. బల్లమీదున్న చేట తీసుకుని, జానకిరామయ్య కుర్చీ దగ్గరిగా వెళ్లి, "ఈ పూట నే వండి పెడతాను! ఏం"

అంది. అని సమాధానం కోసం ఎదురు చూడకుండా వంటగదిలోకి వెళ్లింది.

జానకిరామయ్య చేష్టలు డిగినవాడిలా కుర్చీలో పడుకున్నాడు.

క్రింద ఇంటివారబ్బాయి వచ్చి "ఏమండీ మీ యింటికొచ్చినావిడ కారు దగ్గర పిల్లలు చేరి గొడవచేస్తున్నారండీ!" అని చెప్పాడు.

సుజాత, కడుగుతున్న బియ్యం అక్కడ పెట్టివచ్చి, "చూడు బాబూ! కారు డ్రైవరుతో అమ్మగారు ఈ పూట ఇక్కడే వుంటారుట! సాయంత్రం కారు తీసుకురమ్మన్నారు అని చెప్పు" అని చెప్పింది. కుర్రాడు వెళ్లిపోయాడు.

"మీ వంట్లో బాగుందా?" అనడిగింది జానకిరామయ్యను.

"ఊఁ" అని మూలిగాడు.

"సర్లేండి". మీరు లేవకుండా పడుకోండి! అయిన ఆలశ్యం ఎలాగూ అయింది. ఎసరు తీసి కాఫీ కలుపుకువస్తాను. ఆ తర్వాత స్నానంచేసి వంట చేస్తాను." అని చెప్పి సుజాత లోపలకు పోబోయి, ఆగి "అవునూ! పిల్లలు...."

జానకిరామయ్య సుజాత కళ్లల్లోకి సూటిగా చూసి, "బాబుగల్కకం క్రీస్‌లో వున్నాడు. కమల, మద్రాసు వెళ్లింది!" అన్నాడు

దేనికి?"

"ఐ. ఏ. యస్. పరీక్షలు వ్రాయటానికి!"

"పెళ్లిచేసుకోదా?"

జానకిరామయ్య మాట్లాడలేదు.

సుజాత క్షణకాలం, జానకిరామయ్య మాట్లాడుతాడేమోననిఎదురుచూసింది. ఆయన మాట్లాడడని నిశ్చయించుకుని, అక్కడనుంచి వెళ్ళింది.

ఎసట్లో నీళ్ళుతీసి, ఫిల్టర్‌లో కాఫీపొడివేసి, నీళ్ళు పోసింది. స్టౌ తగ్గించి, సబ్బు. టవల్ తీసుకువెళ్ళి తలారస్నానం చేసింది. చేశాక, ఏం గుడ్డలు కట్టుకోవాలీ అన్న ఆలోచన వచ్చి చీరచుట్టుకుని, తలకు టవల్ కట్టుకుని వచ్చి "అమ్మాయి చీరవుంటే ఇవ్వండీ!" అనంది.

బీరువా తాళంచేతులిచ్చేశాడు జానకిరామయ్య. నేతచీరలన్నీ ఉండీ మడతలు పెట్టివున్నాయి బీరువాలో ! ఒకే ఒక్క పట్టుచీర చాలా పాతదుంది! సుజాత ఆ చీర తీసింది. కలరావుండల వాసనతో కంపుకొడుతున్న ఆ పట్టుచీర కట్టుకుంది సుజాత!

"ఆ పాతచీర ఎందుకు కట్టుకున్నావ్!" అనట్లు చూశాడు జానకిరామయ్య, విస్తుపోతూ సుజాతను.

సుజాత తలొంచుకుంది, తల ఆరబెట్టుకుంటూ "దాన్ని చూడగానే కట్టుకోవాలనిపించింది" అన్నది. అంటుండగా ఆమెగొంతు గద్గదమైంది.

జుత్తు ముడేసుకుని, ఓసారి అద్దంలో చూసుకుని, కుంకుమ తీసి నుదటన పెట్టుకుంది.

''మీ ఆయన పోయాడని విన్నాను!''

ఆమాటకు సుజాత వణికిపోయింది. కళ్లనుండి నీళ్ళు జలజలరాలాయి. పెల్లుబికివచ్చే దుఃఖాన్ని మునిపంటితో, పెదవులనుండి బయటకురాకుండా ఆపుకుని,

''అవును ! ఆయన పొయ్యారు. కాదు నేనే పోగొట్టుకున్నాను,'' అని తేరుకుని, ''అయినా.........నే నింకా పుని స్త్రీనే!'' అంది. అంటూ నవ్వింది. ఆకాశంలోకి దృష్టి సారించి, క్షణం తర్వాత తేరుకుని, కాఫీ కలిపి తీసుకవచ్చి, జానకిరామయ్యకోగ్లాసు ఇచ్చి, తనోటి తీసుకుని గడపకానుకుని కూర్చుంది.

జానకిరామయ్య. కాఫీ త్రాగి, బీడీ అంటించుకున్నాడు.

"ఏమన్నా కబుర్లు చెప్పండి!"

జానకిరామయ్య నవ్వాడు బోసినోటితో! "నేనేం చెప్పేది! నువ్వు చాలా వూళ్లు తిరిగినదానివి. నువ్వు చెప్పరాదూ!'' అన్నాడు.

సుజాతమొహం ఆ మాటకు జేవురించింది. 'నేరావటం ఇష్టంలేదూ అని చెప్పండి వెళ్లిపోతాను. అంతేగాని ఇలా మాటలతో కుళ్లబొడవద్దు!'

జానకిరామయ్య మాట్లాడలేదు. సుజాత అక్కణ్ణుంచి లేచివెళ్లి, వంట పనిలో నిమగ్నురాలైంది.

వంటంతా చేసి వచ్చేసరికి, జానకిరామయ్య కుర్చీలో నిద్రపోతున్నాడు. మధ్యాహ్నం పన్నెండయింది. ఆయన్ను లేపి, భోజనానికి రమ్మని చెప్పింది. ఆయన కాళ్ళు కడుక్కువచ్చేలోపల వంటింట్లో పీటవేసి కంచంపెట్టి, వడ్డించి వుంచింది.

'నువ్వు వడ్డించుకోకపొయ్యావా?' అన్నాడు.

'మీరు తిన్నాక తింటాను!'

జానకిరామయ్య తలొంచుకుని భోజనం చెయ్యసాగాడు.

'మీ ఆరోగ్యం ఎలావుంది?'

'చూస్తున్నావుగా!'

'మళ్లీ పెళ్లి చేసుకోలేదా?'

ఆ మాటకు జానకిరామయ్య బెరుకు బెరుగ్గా సుజాత కళ్లలోకి చూశాడు. చూసి, 'మళ్ళీ పెళ్లి ఎందుకూ? ఓ అనుభవం అయిందిగా' అన్నాడు. అని చెయ్యి కడుక్కుని లేచిపొయ్యాడు.

సుజాతకు దుఃఖం పొర్లుకువచ్చింది ఉప్పెనలా! తల గడపకేసి కొట్టుకుని, 'పాపిష్టిదాన్ని ! తినేఅన్నం వదిలేసి వెళ్లారు.' నేనా ప్రస్థావన తేకుండా వుండాల్సింది.' అని అన్నది.

సుజాత ప్రవర్తన జానకిరామయ్యకు విచిత్రంగా తోచింది.

'నాతిండే అంత ! దానికి బాధపడకు. నువ్వు అన్నం తిను!'

'అయిన పరాభవం చాలండీ మిమ్మల్ని అర్థాకలితో లేపి నేను తిన లేనండీ!'

'నా నొసట ఇలా వ్రాసిపెట్టి వుంది ఆ సంగతి నీకు తెలియదా!' అన్నాడు.

'అంటే ?'

'నువ్వు అన్నంతిని రా చెబుతాను!'

కాదు చెప్పండి ! అటోయిటో తేల్చుకోటానికి వచ్చాను '

'చూసిపోతా వనుకున్నాను '

'కాదు వుండిపోదామనే వచ్చాను.'

'సరే ! నన్నుగూడ ఆలోచించుకోని !'

"మీ నిర్ణయం తెలిపేదాకా అన్నం తినను!' సుజాత కొంగు పరచుకుని పడుకుంది.

జానకిరామయ్యకు ఏం చెయ్యాలో తోచలేదు క్షణం.

లాల్చీవేసుకుని, చెప్పులు తొడుక్కుని, 'నేనలా వెళ్లివస్తాను. వచ్చాక నా చరిత్రంతా చెబుతాను!' అని తలుపు దగ్గరకువేసి వెళ్లిపోయాడు.

సుజాత అలాగే పడుకున్నది, గత వర్తమానాలు కళ్లముందు తిరుగాడు తుండగా అలాగే సొమ్మసిల్లి నిద్రపోయింది.

మళ్లీ మెలకువ వచ్చేసరికి, పొద్దు పడమటకు జారింది. వళ్లంతా నిస్త్రాణ వల్ల చమటపట్టింది. పరుచుకున్న చీరకొంగు, వేసుకున్న జాకెట్టు తడిసింది. లేచివెళ్లి చన్నీళ్ళతో ముహం కడుక్కు వచ్చింది. అప్పుడు బల్లమీదున్న ఉత్తరం చూసింది.

జానకిరామయ్య దస్తూరీ పోల్చుకుంది. ఆకలి గూడ మరచి ఉత్తరం ఆత్రంగా చదివింది.

## 2

సుజాతా !

నా పెళ్లాం లేచిపోయింది.

ఎందుకో తెలుసా.

పెళ్లయ్యేసరికి నాకు ఉద్యోగం లేదు, అందమైన భార్యతప్ప. ఆ భార్యకు అందమేకాదు కోరికలూ వున్నాయి. అవి అర్థచేసుకోని భర్త, అర్థంచేసుకున్నా వాటిని తీర్చలేని అసమర్థతా కూడా వున్నది.

అయినా ఆ భర్తవల్ల పిల్లల్ని కన్నది. ఆయినా ఆమె కోరికలు తరగలేదు. అసంతృప్తి, అయ్యో బ్రతుకు అడవిన పూచిన పువ్వు, యౌవ్వనం కాలానికి బలి అవుతున్నాయన్న ఆవేదనా ఎక్కువవుతున్నాయి.

నాకు ఉద్యోగం వచ్చింది మున్సిపాలిటీలో టీచరుగా. గొర్రెతోక, కనుబొమలమీది వెంట్రుకలు, నా జీవితం ఒకటేనని నా భార్య తెలుసుకున్నది. బస్తీ కాపురంలో మరిన్ని కష్టాలు, ఈతి బాధలు కాక, చుట్టూతా రంగు రంగుల దీపాలు, కోరికలు తీర్చుకునే అవకాశాలు కూడా కనిపించాయి. ఆశలకు రెక్కలొచ్చాయి. ఊహలకు రూపాలు ఏర్పడ్డాయి.

మా యింటి ఎదురు కంట్రాక్టరుకు భార్యాపిల్లలూ వున్నారు. ఓ కారుంది. రెండు లారీలు, ఓ మేడ, పరిజనమూ, పనిమనుష్యులూవున్నారు. బ్యాంకులో లాకర్లున్నాయి. మరో స్త్రీని చేరతీయగల నేర్పు, అవసరమూ, అవకాశము వుంది. నా భార్య అతని నీడన చేరింది.

సుజాతా! నేను అసమర్థుణ్ణి. ఆ సంగతి మరువకు. మంగళసూత్రం కట్టే నాడు తలొంచుకున్న భార్య, జీవితాంతము నా ముందు తలెత్తదనీ, అగ్ని సాక్షిగా నావెంట ఏడడుగులేకాదు, ఏడేడుజన్మలకూ నావెంటనే వుంటుందన్న భావనగల అసమర్థుడను. పిల్లల్ని కన్నతల్లి, ఆ పిల్లలకోసమన్నా, కొంపలో కోరికలు చంపుకుని కాపురం చేస్తుందన్న మూఢనమ్మకం కలవాణ్ణి!

భార్య లేచిపోయి, ఎదురింటి మేడమీదనుంచి, నా జీవితాన్ని రోజూ చూస్తుందన్న ఆలోచన రాగానే, నాలో పౌరుషం వచ్చింది. రెండేళ్ల బాబునీ, ఆర్నెల్ల పాపనూ తీసుకుని వెళ్లిపోయాను మున్సిపాలిటీకి దూరంగా! ఆనాడు నాకు గమ్యంలేదు, పౌరుషం తప్ప. డబ్బులేదు పెళ్ళాం లేచిపోయిందన్న పేరుతప్ప.

బాబు "అమ్మా" అంటే పలికాను. పాప గుక్కపట్టి పాలకోసం ఏడిస్తే, ఎండిన నా గుండెల్లో పొదివిపట్టుకుని, దానితోపాటు ఏడ్చాను చేతగానితనానికి!

రాత్రింబవళ్ళు గడిచిపొయ్యాయి. నా బిడ్డలకోసం, వీధిలో నిలబడి మాదాకవళం తల్లీ, అని గొంతెత్తి ఆక్రోశించాను.

"ఎద్దులా వున్నావ్! ఇదేం తీపరం! ఏదన్నా పనిచేసుకోరాదా!" అన్నాడో ఇల్లుగలాయన.

"బాబూ! పని ఇప్పించండి చేస్తాను" అన్నాను.

"ఏంచేస్తావ్!"

"పిల్లలకు పాఠాలు చెప్పగలను!"

"అయితే సరే! మా పిల్లలకు పాఠాలుచెప్పు" అని దాసయ్యగారు. ఓ గూడు ఇచ్చారు. కూటికి లోపం లేకుండా చూశారు.

నేను అసమర్థుణ్ణే గాని, కుక్కకన్నా విశ్వాసం గలవాడిని, దాసయ్యగారిని కుక్కలా విశ్వసించాను. ఆయన ఓ సంవత్సరం తర్వాత ఆ వూరి బళ్లో మేష్టరుగా ఉద్యోగం ఇప్పించారు. నా ఆర్నెల్ల కూతుర్నీ, ఆయన భార్య పెంచింది కన్నకూతురిలా.

నేను నిమిత్తమాత్రుణ్ణి, అలా మిగిలాను. నా మంచిచెడ్డలు, బాగోగులు, బిడ్డల భవిష్యత్తూ అన్నీ దాసయ్యగారి అజమాయిషీలో జరిగాయి.

సుజాతా!

బాబుతో నాకు ఇబ్బంది లేదు. మొగవాడు గాలికి పెరిగాడు. కానీ పాప! ఆడపిల్ల, దానికి నీళ్ళుపొయ్యడం జడవెయ్యడం, ఆఖరికి పెద్దమనిషైతే.... నాకేం తెలుసు! ఏం చెయ్యగలను. అప్పుడు నాకు భార్య గుర్తుకొచ్చేది. కళ్లంట నీళ్ళు తిరిగేవి. దాన్నిచూసి, ఎన్ని రాత్రులు ఏడ్చానో, ఆవేదనలో కాలి భస్మమైనానో తల్చుకుంటే ఈ నాటికి భయం వేస్తుంది.

"నాన్నా అమ్మేదీ?" అని అడిగేవారు పిల్లలు! ఏడ్చేవాడిని. నాఏడుపుచూసి పిల్లలు ఆ మాట మళ్ళీ అడిగేవారుగాదు. చెరో ప్రక్కనా పడుకోపెట్టుకుని, వాళ్లను నిద్రపుచ్చేవాడిని. నా కొకటే ధ్యాస! అమ్మలేని లోటు ఎలాగూ తీర్చలేను. కానీ ఆయ్య పెంపకంలో వాళ్ళు చెడిపోగూడదు. అయ్యో మా అమ్మే వుంటే?.... అన్న తలంపు ఏనాడు వాళ్ళకు రాగూడదు. వచ్చి, వాళ్ళ జీవితాల్లో బాధా, ఆవేదన ఏర్పడగూడదు. అంతే! అదే నా ఆలోచన! నా ధ్యేయం! ఒక విధంగా నాస్వార్థంగూడ.

నా భార్యపోయ్యాక, నా జీవితమంతా ఎడారిలో నడక. ఆ జీవితపు ఎడారిలో బాబు, పాప రెండు పుష్పాలు. ఆశాధీపాలు.

దాసయ్యగారు కలిగినవారు కాకపోయినా, కనికరం గలవారు. నా పిల్లవాని ఇంజనీరింగ్ చదువుకోసం, ఆయన ఊళ్ళో చందాలు పోగుచేశారు. అది ఆయన మంచితనం! ఆయన భార్య, నా కూతురుకు నానమ్మ అయింది. అయి "కమలా! మీ నాన్న శాపగ్రస్తుడు. కానీ సచ్ఛీలుడు. మీ ఇద్దర్నీ రెండు కళ్ళలా చూసుకుని బ్రతుకుతున్నాడమ్మా. అలాంటి తండ్రికడుపున పుట్టిన మీరు అదృష్టవంతులు. విధి వెక్కిరించినా, కాలానికి కోరికలకూ ఎదురొడ్డి నిలబడ్డ దర్భపుల్ల ఆ తండ్రిని జాగ్రత్తగా చూసుకోమ్మా" అని హితవు చెప్పింది. నడత నేర్పింది ఆ పుణ్య దంపతుల చలవవల్ల, నేను ఈనాటికీ బ్రతికి వున్నాను. మనిషిగా చలామణీ అవుతున్నాను.

నా కొడుకు ఇంజనీరు. అదొక గర్వంనాకు.

నాకూతురు చదువుల సరస్వతి.

ఇంతకన్నా నాకేంకావాలి!

కోరికలు కాలచక్రంలో సమసి పోయ్యాయి.

వయస్సు, ఆరోగ్యం, కంటిచూపు, క్షీణించాయి.

నాకు మిగిలింది, కోరుకోవాల్సిందీ ఏమీలేదు, అనాయాస మరణం తప్ప. దానికోసం ఎదురుచూస్తున్నాను.

రిటైరై నాలుగేళ్ళు.

సుజాతా ఇది నా జీవితం!

నా భార్య నన్నొదిలివెళ్ళి ఇరవయ్యొక్క సంవత్సరం.

ఇంతవరకు, నా పిల్లలకు తెలియదు, వాళ్ళమ్మ బ్రతికేవుందని. వాళ్ళకే మిటి నాకే తెలియదు. తెలిస్తే, వాళ్ళెలా భావిస్తారో గూడ నేనూ హించలేను.

అంతవరకెందుకూ, నేనే నిన్నుచూసి కలకాదు గదా అని భ్రమపడ్డాను. మర్చిపోయిన బంధాన్నీ, మమకారాన్నీ ఎందుకు గుర్తుకు తెచ్చుకున్నావా అని భయపడ్డాను

ఎందుకంటే, నేను అసమర్థుడిని. అంతేగాదు భయస్థుడనుగూడ ! నేను ఇన్నాళ్లూ ఎంతో ఖర్చుతో కట్టుకున్న పిచ్చుకగూడులోకి నువ్వెందుకు వచ్చావు? అన్న భయంతో వున్నాన్నేను. నా పిల్లలేమవుతారో అన్న భయం నాశేషజీవితం ఏమవుతుందీ? అన్న ప్రశ్నకు నాకు సమాధానం దొరకటం లేదు.

నీయిష్టం. బాబూ, పాప నీకూ పిల్లలే! వాళ్ళపై నీకూ మమత, అనుబంధం, అదికారం వున్నాయి. కాదనేశక్తి నాకులేదు.

నీయిష్టం సుజాత! నువ్వుండదల్చుకుంటే వుండిపో! కానీ పిల్లలొచ్చి "మానాన్నేడీ?" అనడిగితే?

"మాఅమ్మేదీ?" అంటే

"చచ్చిపోయింది. అని" నేను చెప్పాలేనాడు. ఆ సమాధానమే వాళ్ళకు చెప్పు!

శలవు
జానకిరామయ్య

# 3

సుజాత ఉత్తరం చదివి శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. అలా చూస్తుండగా ఆ శూన్యంలో ఆమెకి జానకిరామయ్య శవం కనిపించింది. ఆ తర్వాత ఓ సుందరమైన రూపం గోచరమైంది. ఆ రూపానికి ఇరవై ఒక్క సంవత్సరం. పేరు కమల!

"నువ్వెవరూ?" అనడిగింది కమల సుజాతను చూస్తూ, అసహ్యంగా!

"మీ అమ్మను."

"ఛీ ! మా అమ్మ ఏనాడో చనిపోయింది!"

"కాదమ్మా. బ్రతికేవున్నాను!"

"అయితే నువ్వు మా అమ్మవు కానేకావు. బ్రతికుండి మమ్మల్ని అనాథలుగా చేసిపొయ్యావంటే ఇన్నేళ్ళు మేము, కడుపున పుట్టిన బిడ్డలు గుర్తుకు రాలేదంటే నువ్వు తల్లివేగాదు! నీలాంటి తల్లి మాకొద్దు" కమల అదృశ్యమై పోయింది కళ్ళముందునుంచి.

సుజాత ఆ ఇల్లంతా ఒక్కసారి పరిశీలించింది. మునిఆశ్రమంలా వున్న ఆ ఇంట్లో తనకు స్థానంలేదని తెలుసుకుంది. నిశ్చయానికొచ్చింది. గడప దాటబోతూ వెనక్కొచ్చి జానకిరామయ్య వ్రాసిన ఉత్తరం తీసుకుంది.

ఓ చిన్న కాగితంమీద, "వెడుతున్నాను. మళ్ళిరాను. మీరు అంగీకరిస్తారని భావిస్తూ, పెళ్ళినాటి పట్టుచీర తీసుకెడుతున్నాను. అది మీ భార్య జ్ఞాపకచిహ్నంగా మీరు భద్రంగా దాచుకున్నారు గదూ! కానీ నాకొక్క కోరిక మిగిలిందండీ .... పెళ్ళినాటి పట్టుచీర కట్టుకు చచ్చిపోవాలని. అందుకే తీసుకెడున్నాను" అని వ్రాసిపెట్టి.... వెళ్ళిపోయింది.